క్లుప్తంగా

చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించండి



గడివేముల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ చంద్రకళ

గడివేముల: అంగన్‌వాడీ కేంద్రాలలో చదివే చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఉపాధ్యాయురాలు రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకోవాలి

పాణ్యం: అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న త్యాగధనుల స్మారక శిలాఫలకాలకు పాణ్యం మండలంలోని ప్రతి గ్రామం నుంచి పవిత్ర మట్టిని సేకరించినట్లు ఎంపీపీ ఉసేన్‌బీ తెలిపారు. మండలంలో సేకరించిన మట్టి కలశాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఢిల్లీకి పంపించారు. మండల కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, చందమామ రాజన్నలు ఈ కలశాన్ని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దస్తగిరి మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు వెల్డింగ్ చాంద్, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్లకృష్ణయ్య, జనార్దన్, ప్రతాప్‌రెడ్డి, ఉసేన్‌సా పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 0.550 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని వారు తెలిపారు.

ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సి.బెళగల్: వచ్చే నెలలో కర్నూలులో జరగనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌లో మండల ప్రజలు, మత్స్యకారులు పాల్గొని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను సూచించారు. శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శేషఫణిలతో కలిసి ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్యకార సహాయకులు శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ పీరయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో ఆడిట్

సి.బెళగల్: మండలంలోని ఎంఈఓ కార్యాలయం, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జిల్లా ఆడిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం మండలానికి చేరుకున్న ఆడిట్ అధికారులు స్థానిక ఎంఈఓ కార్యాలయంతో పాటు మండలంలోని సంగాల, ఇనగండ్ల, పోలకల్, సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీలు చేశారు. జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్ల పంపిణీ, పాఠశాలల నిధుల వినియోగం, ఉపాధ్యాయులు, సిబ్బంది జీతాల చెల్లింపులు, సర్వీస్ రిజిస్టర్ల (ఎస్ఆర్) నిర్వహణ తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు.

గడ్డివాముల దగ్ధం



తగలబడుతున్న గడ్డి వాము

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ గ్రామంలో వరుసగా గడ్డి వాములు కాలిపోతున్నాయి. శుక్రవారం కూడా గ్రామానికి చెందిన ఓ రైతు గడ్డివామికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. అయితే నాలుగు రోజుల్లో ఎనిమిది మంది రైతుల గడ్డి వాములకు నిప్పు పెట్టింది, ఇంటి ముందు ఉన్న వాహనాలను సైతం తగలబెడుతున్నది స్థానిక టీడీపీ నాయకుడి అనుచరుడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇతడు ఇటీవల ఒకరి ఇంటిలోకి చొరబడి బంగారం, వెండి, నగదును చోరీ చేయడంతో పాటు ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన వైనాన్ని పోలీసులు, ప్రజల సమక్షంలో అంగీకరించాడని సమాచారం. కాగా ఈ దారుణాలకు ప్రేరేపించిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసి శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సురక్షతో మెరుగైన వైద్యం.. మంచి ఆరోగ్యం

- గ్రామాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు
- పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ పరిశీలించారు. అక్కడ ప్రజలకు కల్పించిన సౌకర్యాలను, వసతులను పరిశీలించి, వైద్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యం అందక ఎవరూ ఇబ్బంది పడకుడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ప్రజల చెంతకే వైద్యం అందుతుందన్నారు. డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష క్యాంపులను ఊరూరా నిర్వహిస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బిలకలగూడూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పేదలు చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేయించి చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ మొల్ల జబీన్, ఫార్మసిస్ట్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య

ఓర్వకల్లు: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ తిప్పన్న, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ నాగేశ్వరమ్మ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యం సచివాలయం–2 పరిధిలోని షాదీఖానాలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సునీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆరోగ్య చికిత్స పొందేందుకు ప్రజలు పోటెత్తారు. డాక్టర్లు ఓపీ ద్వారా 1089 మందికి వైద్య చికిత్సలందించారు. 58 మందికి కంటి పరీక్షలు, 126 మందికి రక్త పరీక్షలు చేసినట్లు ఆమె తెలిపారు. సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



పాణ్యంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత



ఓర్వకల్లులో మందులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని పీహెచ్‌సీ వైద్యుడు మోతీలాల్ నాయక్, రఘు, సర్పంచ్ మద్దిలేటి అన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కే.మార్కాపురం గ్రామంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 406 మందికి వైద్యులు సేవలందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ వైద్య శిబిరంలో బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలు, మలేరియా, డెంగీ, గళ్ల తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

కర్నూలు సిటీ: ఎంతో మందికి ప్రాణదానం చేసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల గ్రామ సచివాలయం–1లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరై పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహిమ్యాతో కలిసి ఎమ్మెల్యే సుధాకర్ శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రోగుల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులో భాగంగానే ఇంటింటికి వైద్య సిబ్బందిని పంపి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి వైద్య శిబిరాలకు తీసుకొచ్చి ప్రత్యేక వైద్యులతో చికిత్సలు చేయిస్తున్నారన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఎక్కడా చూడలేదన్నారు.

చంద్రబాబు మాయ మాటలకు మోసపోకండి

అవినీతి కేసుల్లో అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడు జైలులో ఉంటే ఆయన భార్య భువనేశ్వరి నిజం గెలవాలంటూ యాత్ర చేస్తున్నారని, నిజం అనేది ఎప్పుడో గెలిచిందని ఎమ్మెలే సుధాకర్ అన్నారు. 2014 ఎన్నికల్లో 600కిపైగా హామీలిచ్చి అందులో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ అంటూ బ్యాంకుల్లో తీసుకున్న వ్యవసాయ రుణాల వడ్డీని కూడా మాఫీ చేయలేదని, అక్క చెల్లెమ్మలు బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని మోసం చేసిన మాట వాస్తవం కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇంటింటికి ఉద్యోగం ఇస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానని నిరుద్యోగ యువతను మోసం చేశారని, ఎన్నికల ముందు పసుపు–కుంకుమ పేరుతో మహిళలను మభ్య పెట్టాలని చూశారన్నారు. మరోసారి బాబు అండ్ బ్యాచ్ మాయ మాటలు చెప్పేందుకు ఏదో సెంట్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారందరూ మరోసారి జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు డి.వాసు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కిశోర్ రెడ్డి, సాయి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గాలి రాజు, ఖాజా, సురేష్, డీలర్ దావీదు, మద్దిలేటి, రమేష్, వైద్యులు పాల్గొన్నారు.



ఈసీజీ తీస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి రంగంలోనూ అభివృద్ధి
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- వడ్డుగండ్ల, రసూళ్ల పేటలో గడప గడపకు మన ప్రభుత్వం

పాణ్యం: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని బలపనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డుగండ్ల, రసూళ్లపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం పాలన, అభివృద్ధి చేయడం చేతగాక, మధ్యలోనే వదిలిపెట్టి ప్రజల్లో అభాసుపాలయ్యాయని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వాలే కూలిపోయాయని గుర్తుచేశారు. చెప్పిన మాటను తూచా తప్పకుండా పాటిస్తూ, ఇచ్చిన హామీల మేరకు క్యాలెండర్ ప్రకటించి మరీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు.



వడ్డుగండ్లలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గ్రామ సమస్యలకు త్వరలోనే పరిష్కారం

రెండు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి స్థానిక ప్రజలు పలు సమస్యలను వివరించారు. వడ్డుగండ్ల–రసూళ్లపేట గ్రామాల మధ్య బ్రిడ్జి ఎత్తు పెంచాలని, గ్రామంలో మరో 6 కి.మీ మేర పొలాల రస్తాలకు గ్రావెల్ రోడ్లు వేయించాలని, పలు కాలనీలలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బపలనూరు–వడ్డుగండ్ల గ్రామాల మధ్య కానుగల వాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కానుగల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.35 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతుల కోసం డ్వామా పీడీతో మాట్లాడామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పొలాల రస్తాలను అధికారులతో పరిశీలించి బాగుచేయిస్తామన్నారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై దృష్టి పెడతామన్నారు. రసూళ్లపేట–వడ్డుగండ్ల గ్రామాల మధ్య బ్రిడ్జి ఎత్తు పెచేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ సోడం మాధవి, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మమ్మ, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, డీటీ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా చౌడేశ్వరీ ఉత్సవాలు



చౌడేశ్వరీదేవికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవి పౌర్ణమి ఉత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో రాత్రి 8 గంటల సమయంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో స్వాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సిద్ధంగా ఉంచిన నూతన పట్టు వస్త్రాలను తలపై పెట్టుకొని చౌడేశ్వరీమాత ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. గ్రామ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సహకరంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాను సరి చూసుకోండి

సి.బెళగల్: పంట నమోదు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పోలకల్ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల సచివాలయాల్లో, ఆర్బీకేలలో ప్రదర్శనకు ఏర్పాటు చేసిన పంట నమోదు జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నమోదు చేసిన పంటల వివరాలను ఆయా గ్రామాల సచివాలయాల్లో, ఆర్బీకేలలో ప్రదర్శించామని, రైతులు జాబితాలను సరి చూసుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆర్బీకేలలోని వ్యవసాయ సహాయకులు, ఎంపీఈలకు తెలియజేసి, సరి చేసుకోవాలనియాలన్నారు.



జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

వాల్మీకి జయంతోత్సవాలను జయప్రదం చేద్దాం

కల్లూరు: శనివారం జరిగే వాల్మీకి జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరం గౌరిగోపాల్ ఆస్పత్రి సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిందామని పేర్కొన్నారు. నగరంలో వాల్మీకి భవన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకులంగా ఉన్నారని అందుకు సంబంధించిన చర్యలు మొదలయ్యాయని వెల్లడించారు. వాల్మీకుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పేర్కొన్నారు.

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామాల్లో మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించుకోవాలని వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బుల్లెట్ శ్రావణి, మండల వీఆర్‌పీఎస్ అధ్యక్షుడు ముడుమాల మద్దిలేటి సూచించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా శనివారం మహర్షి శ్రీ వాల్మీకి జయంతిని ప్రతిఒక్కరూ నిర్వహించుకోవాలన్నారు.

చేసిన మంచినే ప్రజలకు చెప్పండి

- ఆంధ్రకు మరోసారి జగనన్న ఎందుకు అవసరమో వివరించండి
- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



కోడుమూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

కోడుమూరు రూరల్/సి.బెళగల్: నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులనే ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. 'ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోడుమూరు, సి.బెళగల్‌లో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో 95 శాతం నెరవేర్చారని, అవినీతికి తావులేకుండా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను గ్రామాలకు చేర్చారని ప్రజలకు తెలియజేయాలన్నారు. నాడు – నేడు ద్వారా విద్యకు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. పవన్, చంద్రబాబు నాటకాలను వివరించడంతో పాటు సంక్షేమ ఫలాలు సక్రమంగా కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కోడుమూరు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్ణారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇమ్మానేయులు, ఏకాంబరం, అయ్యప్ప, సుంకన్న, బలరాం, పాపిరెడ్డి, మధు, సి.బెళగల్ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

- జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారులపై ప్రమాదాలు జరకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జాతీయ రహదారి 44లో ఆదర్శ మారుతి షోరూం, గోశాల దగ్గర రంబుల్ స్ట్రిప్స్, ఐరన్ బారికేడ్లను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఉన్న స్పీడు బ్రేకర్లను వాహనదారులు గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. జాతీయ రహదారిపై పదిరోజుల్లో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. బళ్లారిచ చౌరస్తా, రాజీవిహార్ సర్కిళ్లలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాటిని సీజ్ చేయాలని, అవసరమైతే బండి నడిపిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. నగరంలో పలు చోట్ల బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆర్‌అండ్‌బీ అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ..కేంద్ర రోడ్లు మరియు రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రమాదంలో ఎవరైన మరణిస్తే రూ.2 లక్షలు, గాయపడితే రూ.50 వేలు అందజేస్తామన్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన 6మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణంతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు

కర్నూలు (న్యూసిటీ) : డోన్, ప్యాపిలి, ఉల్లిందకొండ ప్రాంతాల్లో అక్రమంగా నాపరాయి, గ్రావెల్, డోలమైట్ పౌడర్‌ను రవాణా చేస్తున్న మూడు వాహనాలను గురువారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు.

చెరువు ఆక్రమణపై కలెక్టర్ ఆరా

కల్లూరు: గార్గేయపురం చెరువు ఆక్రమణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆరా తీశారు. చెరువులో రోడ్డు వేస్తున్నట్లు గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి వివరాలు అడిగారు. క్షేత్రస్థాయికి వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించి తనకు నివేదిక సమర్పించాలని కల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె ఆదేశించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన లాలూప్రసాద్ యాదవ్ (30) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విరక్తి చెంది శుక్రవారం మద్దికెర–మల్లప్పగేట్ స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లాలూప్రసాద్ యాదవ్ పలు ఆస్పత్రులో చూపించకున్నా కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి చనిపోయాడు. మృతుడికి గతేడాది నందిని అనే యువతితో వివాహం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు







తీవ్రంగా గాయపడిన సాయి, వెంకటేష్, నబీ

ఆస్పరి: మండలంలోని నలకదొడ్డి బస్‌స్టాప్ వద్ద శుక్రవారం బొలెరో, ఆటో ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పరి నుంచి బిల్లేకల్లు వెళ్తున్న బొలెరో, బిల్లేకల్లు నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఆటో నలకదొడ్డి బస్ స్టాప్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్, బళ్లారికి చెందిన నబీ, ఈరన్నకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్ ఆటోలో చిక్కుకుపోవడంతో స్థానికులు అతికష్టంపై బయటకు తీశారు. గాయపడిన నలుగురిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

35 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో శుక్రవారం 35.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. అలాగే కాలువలకు వదులుతున్న నీరు, ఆవిరి రూపంలో డ్యాంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోది. శుక్రవారం డ్యాం 1609 అడుగులతో 35.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డ్యాంలో నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోగా కాలువలకు (అవుట్‌ఫ్లో) వదిలే నీరు 9,066 క్యూసెక్కులుంది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 527 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.